ఓంశ్రీసాయిరాం

మనసు మాట నడత మనిషికి ఒకటైన
సత్యవంతుడగును సరళితోడ
సత్యవంతుడైన దైవసాన్నిధ్యంబు
పొందుచుండు, పరమునొందుచుండు.

ఇనుము విరిగినయంత యిమ్మారుముమ్మారు
కాల్చి అతకవచ్చు కమ్మరీడు
మనసు విరిగనంత మరి చేర్చగలమా.

ప్రేమస్వరూపులారా!

'జంతూనాం నరజన్మ దుర్లభం'. జన్మించిన జంతువులన్నింటిలోనూ మానవజన్మ దుర్లభమైనది. మానవత్వాన్ని వికసింపచేయుటకుగాని, ప్రకటింపజేయుటకుగాని కారణములు మూడు. మనసు, మాట, నడత. వీటినే త్రికరణములని చెబుతూ వచ్చారు. ఈ మూడింటినీ సక్రమమార్గమున పెట్టినప్పుడు పూర్ణమానవుడు కాగలడు. వీటినే వక్రమార్గమున పెట్టినప్పుడు పశువుగా మారును. మానవత్వమునకు, పశుత్వమునకు గల తారతమ్యము ఈ త్రికరణముల వలనే జరుగుతున్నది. మొదటిది మనస్సు. 'సంకల్పవికల్పకాత్మకం మనః' అని వ్యుత్పత్త్యర్థము. 'మననాన్మనః'. నిరంతరము మననము చేయునదే మనస్సు. ఈ మనస్సు ఒకరికి యిచ్చిన తిరిగి వచ్చునది కాదు. ఇలాంటి మనస్సుయొక్క తత్త్వాన్ని మనిషి గుర్తించటానికి ప్రయత్నించాలి. మనస్సు నిరంతరమూ మానసిక సంభాషణలోనూ, ఆలోచనాశక్తిలోనూ మునిగి ఉంటుంది. ఇందులో ఆలోచన కంటె మనిషి మనస్సులో అనేకవిధములుగా సంభాషణ జరపటమే అధికంగా ఉంటుంది. ముఖ్యముగా ఆలోచనలకు, సంభాషణలకు చాలా భేదమున్నది. ఆలోచనలనగా మన సమస్యలను పరిహారముచేసే తత్త్వము. మన సమస్యలను అమితముగా అభివృద్ధిపరచి మానవుని అల్లకల్లోల పరచునటువంటివే సంభాషణలు. కనుక, మానసిక సంభాషణలను అణగత్రొక్కటానికి మొట్టమొదట మనిషి ప్రయత్నించాలి. మనస్సుకు విశ్రాంతినందించటానికి ప్రయత్నించాలి. మస్సులో, అనేకవిధములుగా పరులయొక్క విషయములను ప్రవేశపెట్టుకోటముచేత మనస్సు మరింత మాలిన్యమౌతుంది. మనము దేనిని చింతించుదుమో ఆ విషయములన్నీకూడా కార్బన్ పేపరుపై ప్రింటు అయినట్లుగా మన హృదయములో హత్తుకొనిపోతాయి. తద్వారా ఆధ్యాత్మిక పరిణామము విపరీత మార్గాన్ని అందుకుంటుంది. ఆధ్యాత్మిక శక్తిని కొంతవరకు మరుగుపరుస్తుంది. నిరంతరమూ ఆలోచనామగ్నుని చేస్తుంది. మొట్టమొదట మనసునందుగల మానసిక సంభాషణలను క్రమక్రమేణా తగ్గించుకొనుటకు ప్రయత్నించాలి. ఈ మానసిక సంభాషణలు మితిమీరి పోవుటచేతనే మతికూడా భ్రమిస్తుంది.

దీనిని మనము ఏరీతిగా అరికట్టుకోవాలి. దీనికి మూడువిధములైన మార్గములున్నవి. ఒకటి ప్రాణాయామము. ఉచ్ఛ్వాస నిశ్వాసములను సక్రమమైన మార్గమున అనుసరింపజేస్తూ, వాటియందు లక్ష్యము నిలిపినప్పుడు మానసిక సంభాషణలు అణగిపోతుంటాయి. రెండవది సమాజసేవ. ఏవైనా కర్మలు ఆచరించినప్పుడే మనస్సుయొక్క సంభాషణలను అణగత్రొక్కుటకు వీలుంటుంది. పవిత్రమైన బోధనాకర్మలయందుగాని, రోగుల సేవయందుగాని, మరేవిధమైన సార్థకముగావించే కర్మలయందు మనస్సు లగ్నముగావించినప్పుడు ఈ మానసిక సంభాషణలు అణగిపోతుంటాయి. మూడవది సాధనాసంపత్తి. కీర్తనో, భజనో, ఆసనములో – ఈవిధమైన మార్గములను అవలంబించినపుడు మనస్సు కొంతవరకు అణగి ఉండటానికి వీలుంటుంది. లేక నిరంతరమూ మనస్సు చంచలముగా ఉండినప్పుడు, లేక సంభాషణలు అత్యధికముగా ఉండినప్పుడు గాయత్రీ మంత్రజపము ఈ మానసిక సంభాషణలను అణగత్రొక్కుటకు శక్తివంతముగా ఉంటుంది.

కాని, ఈనాటి మానవుడు నిరంతరమూ పరుల చింతనచేయుచు, పరుల మంచిచెడ్డలను క్రోడీకరించుచు, పరుల దుర్మార్గత్వమును నిరంతరము స్మరిస్తుంటారు. అందువలన మరింత అలికిన బట్టవలె మాలిన్యమౌతుంది. మానవుడు తన మనస్సును వార్తాపత్రికగా తయారుచేసుకుంటున్నాడు. ఈనాటి మానవుని మనసు కేవలము వార్తాపత్రికగా ఉంటుందిగాని, దానిని పవిత్రమైన మానవహృదయముగా మార్చుకొనటములేదు. మానవునకు మనస్సే ప్రధానము కనుక, 'మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అని అన్నారు. బంధమునకు మోక్షమునకు మనస్సే కారణము. కనుక, ఈ మనస్సుతోనే మానవత్వాన్ని అభివృద్ధిగావించుకోవాలి. సంకల్పవికల్పాల మూటయే మనస్సు. క్రమక్రమేణా మన ఆశలను, సంకల్పములను అణగద్రొక్కుటకు సరియైన సాధన సల్పాలి. ఈ మనస్సును పరులు గాయపెట్టిన మానేదికాదు. ఈ మనస్సు విరిగెనా అతికించుటకు సాధ్యము కాదు. కనుక, మనస్సు విరగకుండా చూచుకోటానికి ప్రయత్నించాలి. ఈనాడు మానవుని మనస్సు క్షణక్షణానికి కూడా విరిగిపోతున్నాది. ఏ చిన్న విషములోకూడా ధైర్యాన్ని, సహనాన్ని నిలబెట్టుకోలేకపోతున్నాడు. అల్ప స్వల్ప విషయములకే మనస్సు అల్లకల్లోమైన యింక దీనిని సాధనయందు ఎట్లు యిమడ్చటానికి వీలవుతుంది. ఈ సాధనకు తగిన శక్తిని అందించాలంటే మానసిక విరామము

అధికముగా చేకూర్చాలి. మానసిక విశ్రాంతి నిమిత్తమై మన పూర్వీకులు ధ్యానమును ఒక సాధనగా నియమిస్తూ వచ్చారు. శ్రవణ మనన నిదిధ్యాసలు అన్నీకూడను మానసిక విశ్రాంతి నిమిత్తమై ఏర్పడినవేగాని మోక్షనిమిత్తమై ఏర్పడినవికావనే సత్యాన్ని గుర్తించాలి. మనస్సును అరికట్టమని కొందరు చెబుతుంటారు. ఇది ఎవ్వరికీ, ఎప్పటికీ, ఏనాటికికూడను సాధ్యముకాదు. అరికట్టటమనగా దానిలో ఉన్న మాలిన్యాన్ని పరిహారముచేసుకోటమే. ఏవిధముగా?

చేపలను పట్టటానికి ఒక వ్యక్తి ఎరను పెట్టి గాలము వేయగానే చేప హస్తగతమౌతుంది. కౄరమృగమును అంకుశముతోనే వశముచేసుకుంటారు. విషసర్పములనుకూడా మానవుడు వశముచేసుకుంటాడు. ఈ విషసర్పాన్ని వశముచేసుకోటమంటే ఏమిటి? విషసర్పమునందు రెండువిధములైన దంతములుంటాయి. ఈ విషదంతములను రెండూ తీసివేసినప్పుడే సర్పము వశమౌతుంది. అంతేగాని వశముచేసుకోటమంటే పట్టుకొని చేతిలో పెట్టుకోటము కాదు. అలాంటి విషము తీసిన సర్పమును ఎన్నివిధములుగా చెంత పెట్టుకున్నప్పటికీ ప్రమాదముండదు. అదేవిధముగా మనస్సును స్వాధీనము చేసుకోటమనగా మనసు చేతిలో పెట్టుకోటము కాదు. మనస్సుయొక్క మాలిన్యమును కొంతవరకు తీసివేసినప్పుడు, మనస్సు మన అధీనములోనే ఉంటుంది. ఈ మాలిన్యములనగా ఏమిటి? అరిషడ్వర్గముయొక్క ప్రభావమే. క్రోధము, ద్వేషము, అసూయ యిత్యాదులు మనస్సును వెంటాడటంచేత మనస్సు మనకు అతీతమైన స్థాయిలో ఉంటున్నది. కాన, మనస్సుయొక్క ప్రభావమును క్రమక్రమేణా అణగద్రొక్కటానికి కొన్నివిధములైన ఊహలుగాని, మానసిక సంభాషణలుగాని కొంతవరకు అదుపులో పెట్టుకోవాలి. అప్పుడే మనశ్శుద్ధి ఏర్పడుతుంది.

ఇక రెండవది మాట. ఈ మాటకు ఖర్చులేదు. విలువ ఎక్కువ. మానవుని ఉన్నతస్థాయికి తీసుకొనిపోవుటకుగాని, అధమ స్థాయికి దిగద్రొక్కుటకుగాని మాటయే కారణము. మంచిచెడ్డలకు కూడా మాటలే కారణము. మాట మహా శక్తివంతమైనది. ఈ మహత్తరశక్తిని మానవులు ప్రదర్శించి మానవత్వాన్నికూడా నిర్మూలముగావిస్తున్నారు. ఒక చిన్న ఉదాహరణము. మనిషికేదైనా ఒక ప్రమాదకరమైన మాటగాని, భయంకరమైన మాటగాని చెప్పినప్పుడు క్రమక్రమేణా కృంగిపోయి, తన శక్తినంతా కోల్పోతాడు. చెప్పినది మాట అయినప్పటికీ మనిషియందున్న శక్తినంతనీ ఆకర్షించుకుంటుంది. మాటయే మానవునియందున్న శక్తినంతయూ జుఱ్ఱుకుంటుంది. మానవుని మాట నిర్వీర్యుని గావిస్తుంది. అదే మాట మంచిదిగను, సంతోషకరమైనదిగను చెప్పినప్పుడు మానవునకు ఏనుగంత బలము చేకూరి అనేక బలవత్తరమైన కార్యములలో పాల్గొంటాడు. ఈ బలమును అందించునదిగాని, నిర్బలమును చేకూర్చునదిగాని ఈ మాటయే. ఒక ఖడ్గముచేత చెట్టును కొట్టిన, కొన్ని దినములకది చిగురించ వచ్చును. మాటచేత విరిగిన మనస్సు చిగురించలేదు. మాటచేత అనేక మహత్కార్యములుకూడా నిలచిపోతాయి. ముఖ్యముగా మాటలను అదుపులో పెట్టుకొనుట ప్రధానమైన సాధన. సత్యం వద. ప్రియం వద. సత్యము చెప్పాలి. సత్యముకదాయని కఠినమైన సత్యమును చెప్పి గుండె కూలిపోయేటట్లుగా సత్యము చెప్పకూడదు. కాని, ప్రియముగానున్నదని అసత్యము చెప్పకూడదు. చెప్పే సత్యము ప్రీతిగా, హితముగా ఉంటుండాలి. హింసాదులతో దుష్టముగాని దేహము, అసత్యముచే దుష్టముగాని వాక్కు, అపకారముచేత దుష్టముగాని చేతులు, దుర్భావముచేత దుష్టముగాని చిత్తము మానవునకు అత్యవసరము. కనుక, మానవత్వములో మాట అనునది మహాశక్తివంతమైనదిగా గుర్తించుకోవాలి. అయితే, ఒక్కొక్కప్పుడు ఆవేశము కలిగినప్పుడు మాటల ధోరణి మారిపోతుంది. బలహీనతచేత మాటలు దొర్లిపోయి యితరులను బాధపెట్టటముకూడా జరుగుతుంది. తద్వారా మనము చెప్పిన మాటలన్నీ హృదయములో టేపురికార్డు మాదిరి అందులో చేరిపోతుంటాయి. ఈ మాటలు మన జీవితములో మధ్యమధ్య మనలను మేలుకొలుపుతుంటాయి. అందువలనే మాటలు మంచివిగను, శాంతముగను ఉంటుండాలి. మాటలు అదికముగానున్నవని మౌనము వహించవచ్చును. ఈ మౌనము కేవలము మాటలచేత జరిపినంతమాత్రమున నిజమైన మౌనము కానేరదు. మానసిక మౌనమును కొంతవరకు నేర్చుకోవాలి. అంతర్ బహిర్ మౌనము మానవుని త్రికరణములను పరిశుద్ధము చేయటానికి ఉపకరిస్తుంది.

మాట చాలా ప్రధానమైనటువంటిది. కాని, ఈనాటి మాటలన్నీ నీటిమూటల వంటివి. మాటలు చెప్పేవాడు క్రియలో ఏమాత్రమూ సాధించలేడు. పనులకు మాటలక్కరలేదు. మాటలు చెప్పేవాడు పనిచేయలేడు. మనసుకు, మాటకు, క్రియకు సంబంధమైన వాటిలో మాటలు తగ్గించుకోవాలి. మనసును అరికట్టుకోవాలి. అన్నింటికి సంకల్పములే మూలకారణము. మనము ఏ మాట చెప్పిననూ ఆ మాటయొక్క ఫలితములు హృదయములో చేరుకుంటాయి. ఈ హృదయమునందు చేరినది మనస్సునందు చేరి కొన్ని సంకల్పవికల్పములకు దోహదమౌతుంది.

ఇంక మూడవది క్రియ. క్రియ అనగా చేతులతో చేసేది మాత్రమే కాదు. దేహముతో చేసేవలన్నీ క్రియలే. మనము ఎట్టి పనులను చేతుమో అట్టి ఫలితమును అందుకుంటాము. ఇది law of nature. అని చెప్పవచ్చును. వేడి, గాలి, చలి మనము నమ్మినా నమ్మకపోయినా వీటి ప్రభావము మనపై చూపుతాయి. నీవు కర్మలయొక్క ఫలితములు నమ్మినా నమ్మకపోయినా వాని ప్రభావము తప్పదు. కనుక, మనము మంచి కర్మలుచేసి మంచి ఫలితము అనుభవించటానికి ప్రయత్నించాలి. కొంతమంది 'నాకీ కర్మలమీద నమ్మకము లేద'ని చెప్పవచ్చును. మీ నమ్మకములను, అపనమ్మకములను కర్మలేమాత్రమూ విచారించవు. నీవు చేసిన కర్మయొక్క ప్రతిఫలమును నీవు అందుకొనక తప్పదు. కర్మల వలననే మానవుడు అనేకవిధములైన బాధలకు గురియగుచున్నాడు. లోకములో

మానవులు అనేకవిధములైన దుఃఖములకు గురియగుచున్నారు. ఆర్థిక దుఃఖము, అనారోగ్య దుఃఖము, మానసిక దుఃఖము, సాంసారిక దుఃఖము. ఈ అన్ని దుఃఖములకు మనముచేసే కర్మలే మూలకారణము. కొంతమంది భావించవచ్చు, 'నేను ఈవిధమైన దుఃఖము అనుభవించుటకు కారణమేమి?' అని. ఈ కర్మల ఫలితమునకుగాని, కర్మల జయమునకుగాని భగవంతుడు కారణము కాదు. ఎట్టి కర్మను చేసిన అట్టి ఫలితమును అందుకొనక తప్పదు.

పాపమనగ వేరు పరదేశమున లేదు
తాను చేయు పనుల దగిలియుండు
దేవుడనగ వేరు దేశమందున లేదు
తాను చేయు పనుల దగిలియుండు.

కనుక, మన పనులయందే పశుత్వాన్ని, మానవత్వాన్ని ప్రకటించుట సాధ్యము.

ఈనాడు మానవుని గుణములను, మానవత్వాన్ని మనము అనేకవిధములుగా చాటుచున్నాము. ఈ చాటుటకు పూర్వము మనము ఆచరణలో పెట్టాలి. ఈనాటి లోకములో విద్యార్థుల పరిస్థితులు మితిమీరిపోయి, అల్లకల్లోమైపోయిన స్థాయికి దిగజారిపోయినవంటే మూలకారణము ఏమిటి? మానవత్వాన్ని తెలిపేటువంటి పుస్తకాలు లేకనా? మానవత్వాన్ని బోధించే గురువులు లేకనా? విద్యాసంస్థలు లేకనా? కావలిసంత జ్ఞానమున్నది. మార్కెట్‌లో ఆధ్యాత్మికత్వాన్ని బోధించే, మానవత్వాన్ని ప్రకటంచే పుస్తకాలు కొల్లలుకొల్లలుగా, గుట్టలుగుట్టలుగా పడివుంటున్నవి. ఇంక ఆధ్యాత్మిక బోధలు సలిపే గురువులు వీధివీధికి తిరుగుచున్నారు. కాని, ఏమాత్రమూ పరిణామము జరగకుండా ఉండటానికి కారణమేమిటి? గ్రంథములు వ్రాసినవారుగాని, బోధించే గురువులుగాని ఈ జ్ఞానాన్ని ఆచరణలో పెట్టకపోవటమే దీనికి మూలకారణము. అధ్యాపకుల ప్రవర్తన ఇక్కడ చాలా అవసరముగా ఉంటుండాలి. మనము పిల్లలకు ఏ విషయాన్ని బోధిస్తున్నామో ఆ విషయాన్ని మనము నిత్యజీవితము లోపల ఆచరించటానికి లేక దానిని సరియైన రీతిలో ప్రవేశపెట్టటానికి తగిన శక్తియున్న గురువు బోధించినప్పుడే విద్యార్థులు సక్రమమైన మార్గానికి రావటానికి వీలవుతుంది. మనము ఈనాడు అనేక ఉపన్యాసములను చెప్తుతుంటాము. ఏ గ్రంథమలోనో చదివి, ఎవరో చెప్పిన కొటేషన్స్ తీసుకొని, భగవద్గీతనో, ఉపనిషత్తునో, బ్రహ్మసూత్రమునో తీసుకొని, వీటినన్నింటినీ క్రోడీకరించుకొని ఉపన్యాసమునకు సిద్ధమౌతున్నాము. ఈవిధమైన ఆర్టిఫిషియల్ ఉపన్యాసములు అధికమవటంచేత విద్యార్థులలో సక్రమ పరిణామము లేకపోవుచున్నది. మన బోధలతో కాదు విద్యార్థులు మారవలసినది. మన ప్రవర్తనలతో మారాలి. మనము చెప్పుచున్నాముగాని మనము చెప్పిన రీతిగా నడచుకొనుచున్నామా? ఈవిధముగా నడచుకోలేని సమయములో విద్యార్థులు వీటిని ఏవిధముగా అనుసరిస్తారు. ఇది కేవలము ఒకవిధమైన కసరత్తుగా ఉంటుంది. మానవజీవితమనేది తిమింగలముతో చేరిన నదివంటిది. ఈ తిమింగలమున్న నదిలో ఈతలాడి దానిలోనున్న కమలములను కోసుకోటమనేది ఒక పెద్ద కసరత్తుగా ఉంటుంది. 'జీవితమనేది ఒక మంచు. ఇది ఉన్నంతలో నలుగురిని పెంచు' అన్నాది ఒక శాస్త్రము. కనుక, మనలోనున్న శాంతభావములను అభివృద్ధి పరచుకొని ఈ శాంతము వుండినంతలోనే నలుగురికీ శాంతము పంచాలి'

ముఖ్యముగా మన సంస్థలలో సాధకులకుగాని, అధ్యాపకులకుగాని త్రికరణశుద్ధి అత్యవసరము. భారతీయ సంస్కృతియందు ఏ చిన్న పనిచేసినా త్రికరణశుద్ధితో చేయమంటున్నారు. త్రికరణశుద్ధిగా చెప్పమంటున్నారు. త్రికరణశుద్ధిగా వినమంటున్నారు. మనస్సు మాలిన్యములేకుండా మానసిక సంభాషణలను అణగద్రొక్కటము మొదటిది. మాటలతో ఇతరులను నొప్పించకుండా, పవిత్రమైన భావములచేత పలుకులను ఉచ్చరించటము. క్రియలచేత నిత్యమూ పరోపకార సంబంధమైన కర్మలను ఆచరించటము. ఈ మూడింటికి సంబంధమైన సరుకును మనము ఈనాడు క్రోడీకరించుకోవాలి. ఈ మూడు కరణములకు సరియైన శక్తినందినిచే బోధలను అభివృద్ధి పరచుకోవాలి. మనము ఆస్తికులముగానీ, నాస్తికులముగానీ మొట్టమొదట law of nature అనే సత్యాన్ని గుర్తించాలి. ఏది చేసినా తత్ఫలితమున్నదనే విశ్వాసాన్ని పెంచుకోవాలి. ఈ విశ్వాసమున్నప్పుడే దానిని ఆచరణలో పెట్టటానికి ఉత్సాహముంటుంది. పరిస్థితి + ప్రయత్నము = జీవి అన్నారు. జీవి X అనంతము = భగవంతుడు అని అన్నారు. దీనినే విరాట్‌స్వరూపమనికూడా అన్నారు. ఈ హిరణ్యగర్భుడనగా mind X infinity = hiranyagarbha మనము నేరోమైండ్‌గా కాకుండా విశాలమైన, అనంతమైన మైండ్‌గా తీసుకుంటే అదే హిరణ్యగర్భుడు. దృశ్యమునకు అదృశ్యమునకు మధ్యనున్న సేతువే జీవితము. ధనసంపాదనే మానవత్వమునకు సార్థకమని మనమనుకొంటున్నాము. తాను సంపాదించే ధనమే మానవత్వమునకు విలువ అని మనము అనుకొంటున్నాము. తాను సంపాదించిన విజ్ఞానమే మానవత్వమునకు విలువ అని మనము అనుకుంటున్నాము. ఐశ్వర్యముగాని, విజ్ఞానముగాని, విద్యగాని, ధనముగాని మానవత్వానికి ఏమాత్రమూ సంబంధించినవికావు. వీటన్నింటికంటే విలువైనవాడు మానవుడు. కాని, ఈనాటి మానవత్వములో ఈ అర్థాన్ని మనము గుర్తించుకోటంలేదు, జీవితముపై గల ప్రేమనే మనము ప్రధానముగా తీసుకుంటున్నాము. జీవితముపై ప్రేమ ఉండుట ప్రధానము కాదు. ప్రేమమయ జీవితాన్ని మనము గడపాలి.

ప్రేమమయ జీవితాన్ని గడపాలని నేను అనేకమార్లు చెబుతున్నాను. అయితే ఆ ప్రేమను మనము ఆచరణలో అంతోయింతో

పెడుతున్నామా? పెట్టటము లేదు. కొన్నింటినైనా ఆచరణలో పెట్టాలని బోధిస్తున్నాను. కాని, ఆచరణలో పెట్టకపోవటము వలనే పిల్లలు మన మార్గమును అనుసరించలేకపోతున్నారు. ఒక చిన్న ఉదాహరణము. చిన్న పిల్లలకు శాంతముతో, ప్రేమతో బోధించమని చెబుతున్నాము. కాని, ఆ శాంతమనే దానిని మనము కొన్నికొన్ని సమయములలో కోల్పోతున్నాము. మనము పిల్లలకు 'రామా' అని నేర్పిస్తున్నాము. మనము 'రామా' అన్నప్పుడు ఆ పిల్లవాడు 'లామా' అన్నాడంటే మనకు కోపం వస్తుంది. బోధించేటప్పుడు మొదటి రెండుసార్లు 'రామా' అంటాడు. మూడవసారి కోపముతో 'ర్రామా' అంటాడు. కోపముతో బోధించగనే ఆ పిల్లవాడుకూడా 'ర్రామా' అనేదే నేర్చుకుంటాడు. కనుక, పిల్లలముందు అధ్యాపకులు తమ బలహీనతను యేమాత్రమూ చూపకూడదు. మన బలహీనతలను అనుసరించియే పిల్లలు పెడమార్గము పడుతున్నారు. కారణమేమనగా మన కరణాల్లో వున్న ఉద్రేకములు వారి కరణములనుకూడా ఉద్రేకపరుస్తుంటాయి. కనుక, మనము పిల్లల ముందర పరదూషణ చేయటముగాని, పరుల దోషములను చర్చించటముగాని లేక ఉద్రేకముగా వారికి చెప్పటముగాని లేక సత్యాన్ని ప్రీతితో బోధించకపోవటముగాని, ఇవన్నీచేసి మనము పిల్లలకు ఎన్ని బోధించిననూ లాభము లేదు. మనలోనున్న బలహీనతలను పిల్లల ముందు ఏమాత్రమూ ప్రదర్శించకూడదు. ముఖ్యముగా ఇది గొప్ప సాధన. ఏ జపములు, తపములు, స్మరణలు చేయటానికి వీలులేకపోయిననూ మన ఇంద్రియములను, ఈ మాటను, మనస్సును, పనిని ఈ మూడింటినీ సక్రమ మార్గములో పెట్టుటకంటే మరొక తపస్సు లేదు. ఈ కర్మలన్నియూ మానసిక పరిశుద్ధత కోసమేర్పడినవే. 'చిత్తస్య శుద్ధయే కర్మ' అన్నారు. మనము చేసే సర్వ కర్మలూకూడా చిత్తశుద్ధికి మాత్రమే.

కనుక, మన అధ్యాపకులు నూరు చెప్పుటకంటె ఒకటి చేసి చూపించాలి. మనము ఆచరణలో పెట్టాలి. పరుల నిమిత్తమని భావించకూడదు. మీరు మీనిమిత్తమై ఆచరించాలి. నీవు పరులకోసం భోజనము చేస్తున్నావా? లేదు, నీకోసము నీవు భోజనము చేస్తున్నావు. మనము ఆధ్యాత్మికమందున్న పవిత్రమైన, ప్రధానమైన సూత్రములను ఆచరణయందు పెట్టినప్పుడే, మన బోధలుగాని, మన ఆశయములుగాని దిగ్విజయాన్ని పొందటానికి వీలవుతుంది. విద్య అనగా పదములకు ప్రధానమైన అర్థములను బోధించటమే కాదు. మన మానసిక సంబంధమైన తలుపులను తెరిపించేటువంటిదే నిజమైన విద్య. కనుక, మానసిక సంబంధమైన ద్వారములను తెరిపించటానికి సరియైన ప్రయత్నము సలపాలి. మానవజీవితమంటే ఏమిటో మనము మొట్టమొదట గమనించాలి. జగత్తులో ఉండే పదార్థములు, శక్తులు నాకంటే గొప్పవి కాదని ఏనాడు మానవుడు గుర్తించుతాడో ఆనాడే అతని హృదయముయొక్క కవాటములు తెరుచుకుంటాయి. ఈ ధనము, ఈ ఐశ్వర్యము, ఈ విద్య, ఈ విజ్ఞానమే గొప్పవి అని ఏనాడు అనుకుంటాడో ఆనాడే వాడు కూలిపోతాడు. ఇవన్నీ బహిర్ముఖమైనవి. మనము బహిర్ముఖమైన పరిస్థితులు మాత్రమే గమనిస్తున్నాము. అంతర్ముఖమైన తత్త్వాన్ని గమనించటం లేదు. 'పశ్యతీతి పశుః' అని అన్నారు. బహిర్ముఖాన్ని చూచేది పశువు. 'నేను ఇంతవరకు చదువుకున్నాను' అనేది లోకసంబంధమైన గౌరవము. దీనిని మనము ఏమాత్రమూ ఉచ్చరించకూడదు. 'నేను ఇన్ని ఉపన్యాసములు యిచ్చాను' అని అనుకోటము లౌకికమైనది. ఇవి కాదు నీ ఘనతకు గుర్తులు. ఇవన్నీ ఏనాడు మరచిపోదువో అదే నీ మానవత్వానికి సరైన గుర్తు. మానవత్వానికంటే మించినది లేదనే సత్యాన్ని గుర్తించాలి.

ఈనాడు మానవత్వమంటే ఎనభై, తొంభై పాయింట్లను చెబుతున్నాము. దయ మానవత్వము. దమము మానవత్వము. సహనము మానవత్వము. శాంతము మానవత్వము. త్యాగము మానవత్వము. క్షమ మానవత్వము. ఈ ఆరింటియందే అరవై గుణములు ఉంటున్నాయి. మనలోనున్న మానవత్వాన్ని అభివృద్ధిచేసుకోటానికి ఈవిధమైన గుణములను అభివృద్ధిచేసుకోవాలి. ఈనాడు లోకములో ఇంటలెక్చువల్స్‌ను చాలా తెలివిగలవారని అనుకొంటున్నాము. ఈ తెలివితేటల వలననే ప్రపంచము యిన్నివిధములుగా దిగజారిపోయింది. తక్కువ తెలివితేటలున్నవాడు ఎక్కువ విషయములను తెలుసుకోగలడు. ఎక్కువ తెలివితేటలున్నవాడు ఎక్కువ అనుమానాలకు గురౌతాడు. తెలివితేటలు పెరిగిపోవటం వలన అనుమానాలుకూడా పెరిగిపోతున్నాయి. ఈనాడు మానవునిలో గొప్ప తెలివితేటలు ఏమిటి? సామాన్యమైన సత్యమును అలక్ష్యము చేస్తున్నాడు. కఠినమైన సత్యాన్ని అర్థముచేసుకోటం లేదు. ఇక తెలివితేటలను పెంచుకొని ఏమి లాభము? తన ఇంద్రియములు సులభమైన మార్గములలో దిగజారిపోయేటట్లు చేసుకుంటున్నాడు. ఒక చిన్న ఉదాహరణ. ఇంటికి నిప్పంటుకుంటే పరుగెత్తి బయటకు వచ్చి రక్షించుకొన వచ్చును. ఇంద్రియములకే నిప్పంటుకుంటే నీవు ఎక్కడికి వెడితే ఆరుతుంది? ఎక్కడికి పోయిననూ దీని బాధ నీకు తప్పదు. కనుక, ఇంద్రియాలకు నిప్పంటుకోకుండా చూచుకోవాలి. మనము పిల్లలకు బోధించే సమయములో నవ్వుముఖముతో బోధించాలి. పదిపర్యాయములు కూడా చెప్పే ఓపికను సంపాయించుకోవాలి. ప్రేమతో మనము బోధించాలి. ఎందుకనగా, ఈనాడు లోకములో అధికులను చూచి చిన్నవారు అనుకరిస్తున్నారు. కనుక, మనము సరిగా లేకపోతే పిల్లలుకూడా సరిగా ఉండటానికి వీలుకాదు. ఈనాటి పిల్లల పెడమార్గమునకు పెద్దలే మూలకారణము. ఈనాటి విద్యావిధానములో నైతికశక్తి కూలిపోటానికి ఈ అధ్యాపకులే ముఖ్య కారణము.

కనుక, మన సత్యసాయి సంస్థలలో ఉన్న ఉపాధ్యాయులు సరియైనటువంటి ఆదర్శవంతమైన ఉపాధ్యాయులుగా తయారుకావాలి. ఇది కేవలము పిల్లల కోసమే కాదు. మీ సాధన నిమిత్తమై. ఇది మీరొక సాధనగా భావించాలి. 'మేము బోధించే

వారము, పిల్లలు నేర్చుకొనేవారు' అల్పము, అధికము అనేటువంటి స్థాయిలో మనము భావించకూడదు. ఏనాడు నేను బోధిస్తున్నాని అహంకారము వచ్చిందో ఆనాడు వాడు అల్పునికంటె అల్పుడు. నేను పిల్లలకు నేర్పించినప్పుడు నేను నేర్చుకుంటున్నాననే భావము రావాలి. పిల్లలకు నేర్పేటువంటి అధ్యాపకుడు జీవితమంతా నేర్చుకుంటూ ఉండాలి. కనుక, నిజమైన విద్యార్థి ఉపాధ్యాయుడే. ఇటువంటి భావము పెట్టుకుంటే మనము ఎంతైనా సాధించటానికి వీలవుతుంది.

అధ్యాపకులారా! ఈనాడు లోకములో విద్యావిధానము ఏవిధమైన వికారమార్గమును అవలంబిస్తున్నదీ మీకు తెలియనిది కాదు. కనుకనే, సత్యసాయి సంస్థలలో ఉన్న ఉపాధ్యాయులు తగిన రీతిలో సరియైన విశ్వాసమును బలపర్చుకొని మీ సాధనలయందు మీ కరణములను అదుపులో పెట్టుకొని విద్యను బోధించటానికి సరియైన కృషిచేయాలి. ఈ ఉండిన ఏడెనిమిది దినములలో మీకున్న సందేహములుకాని, ఏవిధమైన మార్గము అవలంబిస్తే సరియైన అభివృద్ధి జరుగుతుంది అనే విషయాలను మనము దినమూ తర్కించుకొని, కొన్ని పరిహారములను తెలుసుకొని తద్వారా నిర్భయముగా, నిశ్చింతగా, స్వార్థము నిర్మూలముగావించి స్వేచ్ఛాజీవితమును అనుభవించటానికి తగిన అవకాశములను అందుకోండి. సత్యాన్ని గుర్తించినప్పుడే నిర్భయము మనలో ప్రవేశిస్తుంది. ఈనాడు మనము సత్యాన్ని గుర్తించుకోలేకపోవటముచేత డౌట్లు, భయము, స్వాతంత్ర్యము లేకపోవటము కలుగుతుంటాయి. సత్యమునకు భయము లేదు. అసత్యము త్వరగా పనిచేస్తుంది. అయితే దానిని మనము అవలంబించకూడదు.

తెలుగులో ఒక గాథ ఉన్నది. 'సత్యము చెప్పులు తొడుగుకునేటంతలో అసత్యము ప్రపంచము చుట్టుకొని వస్తుంది. అసత్యము చాలా వేగముగా పోతుంటుంది. కాని, ఆ వేగముతో మనకవసరము లేదు. slow and steady wins the race. రేపటినుండి మీలో ఉన్న సంశయములుగాని, అవసరమైన విషయాలు తెలుసుకొనుటకు మీకు స్వామి దగ్గర స్వాతంత్ర్యమున్నది. కనుక, ఇటువంటి అవకాశము సద్వినియోగము చేసుకొని మీ సందేహములను నిర్మూలము గావించుకోండి.